# తిలక్ శతక జోరు

## కౌంటీల్లో అదరగొట్టిన హైదరాబాదీ



లండన్: ఇంగ్లండ్ కౌంటీల్లో బరిలోకి దిగిన తొలిసారే భారత స్టార్ క్రికెటర్ ఠాకూర్ తిలక్‌వర్మ సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. కౌంటీ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఎసెక్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హంప్‌షైర్ తరపున బరిలోకి తిలక్(239 బంతుల్లో 100) శతకంతో విజృంభించాడు. భారత టెస్టు జట్టులో చోటు ఆశిస్తున్న ఈ హైదరాబాదీ బ్యాటర్ కౌంటీల్లో సత్తాచాటాలన్న పట్టుదలతో బరిలోకి దిగాడు. 11-2తో హంప్‌షైర్ కష్టాల్లో ఉన్నప్పుడు బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్ అద్భుత పరిణతి కనబరిచాడు. కౌంటీల్లో ఆడుతున్నది మొదటిసారే అయినా అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఎసెక్స్ బౌలర్లను ఎదుర్కొంటూ జట్టును ఒడ్డున పడేశాడు. ఈ క్రమంలో ఫ్లెచా మిడిల్టన్(52), కెప్టెన్ బెన్ బ్రౌన్(43), లియామ్ డాసన్ కలిసి 129 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆఫ్‌స్పిన్నర్ సైమన్ హర్మర్‌ను ఏ మాత్రం కుదురుకోనివ్వని తిలక్ సాధికారిక ఇన్నింగ్స్‌తో కదంతొక్కాడు. టీ20 బ్యాటర్ అని తనపై ఉన్న ముద్రను చెరిపేసుకునేందుకు కౌంటీల బాటపట్టిన తిలక్ తొలి ప్రయత్నంలోనే సఫలమయ్యాడు. ఆడిన తొలి మ్యాచ్‌లోనే సెంచరీ చేసి పీయూశ్ చావ్లా, మురళీ విజయ్, రహానే సరసన తిలక్ నిలిచాడు. రానున్న దేశవాళీ సీజన్‌లోనూ మెరుపులు మెరిపించేందుకు వర్మ సిద్ధమవుతున్నాడు.




# బ్యాడ్మింటన్ హబ్‌గా హైదరాబాద్

- మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ బ్యాడ్మింటన్ హబ్‌గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ బ్రాండ్ మెరువాలనే ఉద్దేశంతో నూతన క్రీడా పాలసీని తీసుకొచ్చామని ఆయన అన్నారు. మంగళవారం నిజాంపేట సమతానగర్‌లో ఎస్‌ఎల్‌వీ ప్రొ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఒకప్పుడు క్రికెట్‌ను మాత్రమే క్రీడగా భావించేవారు. ఇప్పుడు పరిస్థితిలో మార్పువచ్చింది. తల్లిదండ్రుల ఆలోచన విధానం మారింది. హైదరాబాద్ అంటే బిర్యానీ గుర్తుకు వచ్చేది. ఇప్పుడు బిర్యానీతో పాటు బ్యాడ్మింటన్ చేరిపోయింది. గోపీచంద్, సింధు, సైనా, సాత్విక్‌సాయిరాజ్ లాంటి ప్లేయర్లు హైదరాబాద్ నుంచే తమ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుంటూ చాలా మంది చిన్నారులు బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా ఎంచుకుంటున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్న పట్టుదలతో ముందుకెళుతున్నారు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పాల్గొన్నారు.

# రింకూ సింగ్ పెండ్లి వాయిదా!



లక్నో: టీమ్‌ఇండియా యువ క్రికెటర్ రింకూ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్ పెండ్లి వాయిదాపడినట్టు సమాచారం. గత నెలలో ఈ ఇద్దరి నిశ్చితార్థ వేడుక లక్నోలో ఘనంగా జరుగగా.. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ ఏడాది నవంబర్ 19న వీరి వివాహతేదీగా నిశ్చయించారు. కానీ తాజా సమాచారం ప్రకారం రింకూ పెండ్లి వాయిదాపడ్డట్టు తెలుస్తున్నది. నవంబర్‌లో రింకూ క్రికెట్ కమిట్‌మెంట్‌లతో పెండ్లిని వాయిదా వేసుకున్నట్టు వినికిడి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి వివాహం జరుగనున్నట్టు రింకూ కుటుంబీకులు తెలిపారు.

# ఇంగ్లండ్ రికార్డు ఛేదన

## 371 పరుగుల లక్ష్యాన్ని ఊదేసిన స్టోక్స్ సేన

**భారత్‌కు పరాభవం • బౌలింగ్‌లో తేలిపోయిన టీమ్‌ఇండియా • డకెట్ భారీ శతకం**

**ఇంగ్లండ్ లక్ష్యం 371. టెస్టులలో.. అదీ ఆట ఐదో రోజు ఇంత భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే అగ్రశ్రేణి జట్లు సైతం ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాయి. కీలక సమయంలో వికెట్లు పడితే డ్రా వైపునకే మొగ్గుచూపుతాయి. కానీ నాలుగు రోజులుగా బ్యాటింగ్‌కు సహకరించిన పిచ్‌కు తోడు 'బజ్‌బాల్' ఆటతో దూసుకుపోతున్న ఇంగ్లండ్ మాత్రం గురి తప్పలేదు. మూడేండ్ల క్రితం బర్మింగ్‌హామ్‌లో భారత్‌పై సాధించిన రికార్డు విజయం (378) స్ఫూర్తితో హెడింగ్లీలోనూ దుమ్మురేపింది. ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. భారత్ దానిని కాపాడుకోలేక చతికిలపడింది. ఆఖరి రోజు ఏదైనా అద్భుతం జరుగకపోతుందా? అని ఆశించిన టీమ్‌ఇండియా అభిమానులను నిరాశకు గురిచేస్తూ తొలి టెస్టులో పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆఖరికి చివరిరోజు ఆటకు పలుమార్లు అంతరాయం కలిగించిన వరుణుడు సైతం మొహం చాటేయడంతో గిల్ సేనకు ఓటమి తప్పలేదు.**



డకెట్ (149)



క్రాలీ (65)



హెడింగ్లీ: ఇంగ్లండ్ పర్యటనను భారత జట్టు ఓటమితో ఆరంభించింది. దిగ్గజాల నిష్క్రమణ వేళ కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న శుభ్‌మన్ గిల్.. తన నాయకత్వ ప్రయాణాన్ని అపజయంతో మొదలుపెట్టాడు. ప్రతిష్ఠాత్మక టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీలో భాగంగా లీడ్స్ (హెడింగ్లీ) వేదికగా ఐదు రోజుల పాటు ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన తొలి టెస్టులో ఆతిథ్య ఇంగ్లండ్‌నే విజయం వరించింది. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా నిర్దేశించిన 371 పరుగుల ఛేదనను బెన్ స్టోక్స్ సేన.. 82 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి విజయవంతంగా ఛేదించింది. ఓపెనర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' బెన్ డకెట్ (170 బంతుల్లో 149, 21 ఫోర్లు, 1 సిక్స్), జాక్ క్రాలీ (126 బంతుల్లో 65, 7 ఫోర్లు) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జో రూట్ (53 నాటౌట్, 6 ఫోర్లు), జెమీ స్మిత్ (44 నాటౌట్, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశారు. ఆట ఆఖరి రోజు హెడింగ్లీ పిచ్ తొలి రెండు సెషన్ల పాటు బౌలర్లకు ఏమాత్రం సహకరించకపోగా భారత ఫీల్డర్లు కీలక క్యాచ్‌లు జారవిడవడం గిల్ సేన విజయవకాశాలను తీవ్రంగా దెబ్బతీసింది. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ తలా రెండు వికెట్లు పడగొట్టగా బుమ్రాతో పాటు సిరాజ్‌కు ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇక ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

### పట్టుదలగా ఆడి..

భారీ లక్ష్యంతో ఐదో రోజు క్రీజులోకి వచ్చిన ఇంగ్లండ్ ఓపెనర్లు తొలిసెషన్‌లో వికెట్‌ను జారవిడుచుకోవద్దనే పట్టుదలతో ఆడారు. తమ సహజసిద్ధ ఆటకు భిన్నంగా షాట్లకు పోకుండా డిఫెన్స్‌కే ప్రాధాన్యమివ్వడంతో ఆరంభంలో పరుగుల రాక కష్టమైంది. తొలి గంటల పాటు బుమ్రా, సిరాజ్.. ఇంగ్లండ్‌ను కట్టడిచేసినా వికెట్లు పడగొట్టలేకపోయారు. డకెట్ అడపాదడపా బౌండరీలతో అలరించినా క్రాలీ మాత్రం నిదానంగా ఆడాడు. డ్రింక్స్ తర్వాత డకెట్.. ప్రసిద్ధ్‌ను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు రాబట్టాడు. శార్దూల్ కూడా ప్రభావం చూపలేకపోయాడు. క్రీజులో కుదురుకున్నాక క్రాలీ సైతం స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. ప్రసిద్ధ్ వేసిన 22వ ఓవర్లో సింగిల్ తీసిన డకెట్.. బ్యాక్ టు బ్యాక్ అర్ధ శతకాలను నమోదుచేశాడు. ఓపెనింగ్ ద్వయం నిలకడగా ఆడుతూ వంద పరుగుల భాగస్వామ్యాన్ని పూర్తిచేసుకుంది. మొదటి సెషన్‌లో ఇంగ్లండ్.. 24 ఓవర్లలో 4 రన్‌రేట్‌తో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 96 పరుగులు చేసింది.

### డకెట్ శతక మోత

లంచ్ తర్వాత ఇంగ్లండ్ జోరు పెంచింది. బుమ్రా, సిరాజ్ బౌలింగ్‌లో డకెట్ రెండేసి బౌండరీలతో 90లలోకి చేరాడు. సిరాజ్ ఓవర్‌లోనే సింగిల్‌తో క్రాలీ అర్ధ శతకం పూర్తయింది. జడేజా ఓవర్‌లో రెండు బౌండరీలు బాదిన డకెట్.. 97 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సిరాజ్ బౌలింగ్‌లో ఇచ్చిన క్యాచ్‌ను డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ వద్ద జైస్వాల్ జారవిడిచాడు. ఈ మ్యాచ్‌లో జైస్వాల్‌కు ఇది నాలుగో డ్రాప్ క్యాచ్. ఆ మరుసటి ఓవర్‌లో డకెట్.. బౌండరీ సాయంతో టెస్టులలో ఆరో శతకాన్ని అందుకున్నాడు.

### బ్రేక్ ఇచ్చిన ప్రసిద్ధ్

ప్రసిద్ధ్ భారత్‌కు తొలి బ్రేక్‌ను అందించాడు. అతడు వేసిన ఓవర్‌లో క్రాలీ.. స్లిప్స్‌లో రాహుల్ చేతికి చిక్కడంతో తొలి వికెట్ రికార్డు భాగస్వామ్యానికి (188) తెరపడింది. తన మరుసటి ఓవర్లో ప్రసిద్ధ్.. ఓలీ పోప్ (8)ను అద్భుత డెలివరీతో క్లీన్‌బౌల్డ్ చేశాడు. పోప్ స్థానంలో వచ్చిన రూట్‌తో కలిసి డకెట్.. మూడో వికెట్‌కు 47 పరుగులు జతచేశాడు. అయితే డ్రింక్స్ విరామం తర్వాత బంతినందుకున్న శార్దూల్.. ఒకే ఓవర్లో ఇంగ్లండ్‌కు డబుల్ షాకిచ్చాడు. 55వ ఓవర్ మూడో బంతికి డకెట్.. సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ నితీశ్ రెడ్డికి చేతికి చిక్కగా ఆ తర్వాతి బంతికే హ్యారీ బ్రూక్.. రిషభ్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు.

### రూట్, స్మిత్ ఫినిషింగ్ టచ్


టీ విరామం తర్వాత క్రీజులోకి వచ్చిన ఇంగ్లండ్ విజయానికి 102 పరుగులు అవసరమవగా.. కెప్టెన్ బెన్ స్టోక్స్, సీనియర్ బ్యాటర్ జో రూట్ వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. భారత ఫీల్డర్ల తప్పిదాలు వారికి కలిసొచ్చాయి. స్టోక్స్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్స్‌లో రాహుల్ జారవిడిచినా..జడ్డూనే వేసిన తర్వాతి ఓవర్లో ఇంగ్లండ్ సారథి గిల్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ రూట్.. యువ వికెట్ కీపర్ జెమీ స్మిత్‌తో కలిసి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**1** టెస్టుల్లో 2010 తర్వాత నాలుగో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్ డకెట్. ఆ ఏడాది అలెస్టర్ కుక్.. మీర్‌పూర్ టెస్టులో ఫోర్త్ ఇన్నింగ్స్ సెంచరీ సాధించాడు.

**2** టెస్టుల్లో ఇంగ్లండ్‌కు వారి సొంతగడ్డపై ఇది రెండో అత్యధిక ఛేదన. 2022లో ఆ జట్టు భారత్‌తోనే బర్మింగ్‌హామ్‌లో జరిగిన టెస్టులో 378 పరుగుల ఛేదనను విజయవంతంగా పూర్తిచేసింది.

### సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 471; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 465; భారత్ రెండో ఇన్నింగ్స్: 364; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 82 ఓవర్లలో 373/5 (డకెట్ 149, క్రాలీ 65, శార్దూల్ 2/51, ప్రసిద్ధ్ 2/92)




## భారత్ 13-0 మంగోలియా

- అమ్మాయిల రికార్డు విజయం
- ఏఎఫ్‌సీ ఏషియన్ కప్

చియాంగ్ మాయి: ప్రతిష్ఠాత్మక మహిళల ఏఎఫ్‌సీ ఏషియన్ కప్‌లో భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. మంగళవారం 700వ వార్షికోత్సవం జరుపుకున్న చారిత్రక చియాంగ్ మాయి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 13-0 తేడాతో ఆతిథ్య మంగోలియాపై రికార్డు విజయం సాధించింది. ఆది నుంచే తమదైన జోరు కనబరిచిన భారత అమ్మాయిలు.. మంగోలియాను చిత్తుగా ఓడించారు. మ్యాచ్ మొదలైనప్పటి నుంచి బంతిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకున్న టీమ్‌ఇండియా.. మంగోలియా డిఫెన్స్‌ను కకావికలు చేసింది. యువ స్ట్రైకర్ ప్యారీ ఐదు గోల్స్‌తో భారత భారీ విజయంలో కీలకమైంది. తెలంగాణకు చెందిన గుగులోతు సౌమ్య రెండు గోల్స్ చేయడంతో పాటు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ప్రియదర్శిని మరో రెండు గోల్స్ చేయగా, సంగీత, రింపా హల్దార్, మాళవిక, గ్రేస్ దాంగ్మయి ఒక్కో గోల్ చేశారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లో ఈనెల 29న తిమోర్ లెస్టెతో తలపడుతుంది.

## నాగల్ నిష్క్రమణ

- వింబుల్డన్‌లో ముగిసిన భారత్ పోరు



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టోర్నీ నుంచి భారత యువ ప్లేయర్ సుమిత్ నాగల్ నిష్క్రమించాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాగల్ 2-6, 6-4, 6-2తో గులియెమో జెపెరి(ఇటలీ) చేతిలో ఓటమిపాలయ్యాడు. తన(294) కంటే ఎక్కువ ర్యాంక్‌లో ఉన్న గులియెమో(353)కు నాగల్ దీటైన పోటీనివ్వలేకపోయాడు. 2-6తో తొలి సెట్‌ను చేజార్చుకున్న నాగల్..రెండో సెట్‌లో గెలిచి పోటీలోకి వచ్చాడు. అయితే నిర్ణయాత్మక మూడో సెట్‌లో వరుస గేముల్‌ను కోల్పోయిన ఈ యువ ప్లేయర్ సెట్‌తో పాటు మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. దీంతో సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసినట్లయ్యింది. మరోవైపు డబుల్స్‌లో రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ.. భారత్ తరఫున బరిలోకి దిగనున్నారు.



వరుస విజయాలతో తిరుగులేని ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. రీసెంట్‌గా ఆమె కథానాయికగా నటించిన 'కుబేర' సినిమా కూడా భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ విజయంతో తెగ సంబరపడిపోతున్నది రష్మిక. ఈ సందర్భంగా తన కోస్టార్ ధనుష్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించారు.

# మీరు తెచ్చిన లడ్డూలను మాత్రం మర్చిపోను

'మనం కలిసి ఓ భారీ సినిమాకు పనిచేసినప్పటికీ మనిద్దరికీ ఒక్క సెల్ఫీ మాత్రమే ఉంది. మనం మాట్లాడుకుంది చాలా తక్కువ. అది కూడా మనిషికి విశ్రాంతి ఎంత ముఖ్యమో చర్చించుకునేవాళ్లం. కానీ విశ్రాంతి మాత్రం తీసుకోలేదు. నటనాపరంగానే కాదు, వ్యక్తిగా కూడా మీరు ఎంతో మందికి ఆదర్శం. తమిళ డైలాగుల్లో మీరు చేసిన సాయం.. నా నటన నచ్చిన ప్రతిసారీ మీరిచ్చిన ప్రశంసలు ఇవన్నీ వినడానికి చిన్న విషయాలే అయినా.. నాకు మాత్రం జీవితాంతం గుర్తుంటాయి. ముఖ్యంగా మీరు నాకోసం లొకేషన్‌కి తెచ్చిన లడ్డూలను మర్చిపోలేను.' అంటూ ధనుష్‌తో దిగిన ఓ ఫొటోను రష్మిక షేర్ చేశారు.

చిత్రం



# రంభ ఊర్వశి మేనకలతో అల్లరోడు?

'నాంది' సినిమాతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు అల్లరి నరేష్. మారేడుమిల్లి ప్రజానీకం, ఉగ్రం, నా సామి రంగ, ఆ ఒక్కటి అడక్కు, బచ్చలమల్లి.. ఇలా రకరకాల ఎమోషన్స్‌తో కూడిన కథల్ని ఎంచుకుంటూ ఓ ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నారాయన. త్వరలోనే అల్లరి నరేష్ కొత్త సినిమాను మొదలుపెట్టబోతున్నారు. సినిమా పేరు 'రంభ ఊర్వశి మేనక'. శర్వానంద్‌తో 'రాధ' సినిమాను తెరకెక్కించిన చంద్రమోహన్ ఈ చిత్రానికి దర్శకుడు. టైటిల్‌ని బట్టి ఇదేదో ముగ్గురు హీరోయిన్లతో కూడిన సోషియో ఫాంటసీ సినిమా అనుకునే అవకాశం ఉంది. కానీ ఇది ఆ తరహా కథ కాదని, చంద్రమోహన్ గమ్మత్తుగా ఆలోచించి రాసుకున్న కథ ఇదని, టైటిల్ మాదిరిగానే కథ కూడా గమ్మత్తుగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం అల్లరి నరేష్ '12ఏ - రైల్వే కాలనీ' అనే సినిమా చేస్తున్నారు. ఆ సినిమా షూటింగ్ దాదాపు పూర్తికావచ్చింది. దీని తర్వాత 'రంభ ఊర్వశి మేనక' సెట్‌లోకి అల్లరి నరేష్ ఎంట్రీ ఇస్తారట. రెండు ప్రముఖ నిర్మాణ సంస్థ లు ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి.

# కెన్యా అడవుల్లో పోరాటాలు?




ఎస్.ఎస్.రాజమౌళి 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా విడుదలై మూడేళ్లు నిండి, నాలుగో ఏడు నడుస్తున్నది. ప్రస్తుతం మహేశ్‌బాబుతో రాజమౌళి సినిమా చేస్తున్నారు. రీసెంట్‌గానే షూటింగ్ కూడా మొదలైంది. మరి విడుదలెప్పుడు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. సినీప్రియులైతే ఈ సినిమా కోసం కళ్లలో ఒత్తులు పెట్టుకొని మరీ ఎదురుచూస్తున్నారు. రాజమౌళి కూడా వెయ్యికోట్ల ఖర్చుతో నెవ్వర్ బిఫోర్ అనేలా బిగ్గెస్ట్ పాన్‌వరల్డ్ అడ్వెంచర్‌గా ఈ సినిమాను తెరకెక్కించే పనిలో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఫిల్మ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకూ ఈ సినిమా రెండు షెడ్యూల్స్‌ని పూర్తి చేసుకున్నది. అవి కూడా చిన్న షెడ్యూల్సే. అయితే.. ఈ సారి మాత్రం భారీ షెడ్యూల్‌ని కెన్యా అడవుల్లో జక్కన్న ప్లాన్ చేశారట. ఈ షెడ్యూల్‌లోనే హీరోహీరోయిన్లు మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా పాత్రల ఇంట్రడక్షన్ కూడా ప్లాన్ చేశారట. అంతేకాకుండా, కథలో మేజర్ ట్విస్ట్‌ని కూడా ఈ షెడ్యూల్‌లోనే షూట్ చేస్తారట. ఈ క్రమంలో రూపొందించే భారీ యాక్షన్ ఎలిమెంట్స్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని సమాచారం. ఈ సీన్స్ కోసం భారీ వీఎఫ్‌ఎక్స్ ఇంటర్నేషనల్ టెక్నికల్ క్రూ పనిచేస్తున్నదట. 'ఆర్‌ఆర్‌ఆర్' కంటే హై రేంజ్‌లో ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ ఉండనున్నట్లు తెలుస్తున్నది. ట్రెజర్ హంట్ కథాంశంతో రూపొందుతున్న ఈ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, మాధవన్ కీలక పాత్ర పోషించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాత: కె.ఎల్.నారాయణ.

# ముంబైలో 90రోజుల భారీ షెడ్యూల్?



అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ పాన్ ఇండియా సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన ఏ వార్త బయటకొచ్చినా.. అది రూమర్ అయినా.. క్షణాల్లో వైరల్ అయిపోతున్నది. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించిన కీలక సమాచారం వెలుగు చూసింది. ఇప్పటికే ఈ సినిమా పనులు మొదలయ్యాయట. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నట్టు వినికిడి. త్వరలో ఫస్ట్ షెడ్యూల్ కూడా మొదలుకానున్నదట. మూడు నెలల పాటు ముంబైలో జరిగే ఈ భారీ షెడ్యూల్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట. తదనంతరం వీఎఫ్‌ఎక్స్ పనులకోసం టీమ్ మొత్తం అమెరికా వెళ్లనున్నదని సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే.. సమాంతర ప్రపంచాల మధ్య, పునర్జన్మల నేపథ్యంలో సాగే సైన్స్‌ఫిక్షన్ కథాంశంగా ఈ సినిమా ఉంటుందట. ఈ సినిమాకోసం అట్లీ కొత్త ప్రపంచాన్నే సృష్టించే పనిలో ఉన్నారు. దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

# సర్వజన సంరక్షిణి జననీ..



నితిన్ కథానాయకుడిగా సిస్టర్ సెంటిమెంట్ నేపథ్యంలో రూపొందిస్తున్న చిత్రం 'తమ్ముడు'. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. జూలై 4న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. మంగళవారం 'జై బగళాముఖీ' అనే పాటను విడుదల చేశారు. 'జై బగళాముఖీ, జై శివనాయకీ, జై వనరూపిణీ, వీర విహారిణి, సర్వజీవ సంరక్షిణి జననీ..' అంటూ అమ్మవారి మహిమను కీర్తిస్తూ ఈ గీతం సాగింది. జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ఈ పాటను రచించారు. గ్రామ దేవతకు సంబంధించిన జాతర నేపథ్యంలో ఈ పాటను చిత్రీకరించామని, కుటుంబ అనుబంధాలకు దర్పణంలా ఈ సినిమా కథ ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్ తదితరులు చిత్ర తారాగణం.



# మర్డర్ మిస్టరీ నేపథ్యంలో..

నవీన్‌చంద్ర హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'షోటైం'. మదన్ దక్షిణామూర్తి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ గరికపాటి నిర్మిస్తున్నారు. కామాక్షి భాస్కర్ల కథానాయిక. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఓ హత్య చుట్టూ అల్లుకున్న సంఘటనలతో ట్రైలర్ ఆసాంతం ఆసక్తికరంగా సాగింది. వీటితో పాటు కోర్ట్‌రూమ్ సన్నివేశాలు, పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. మర్డర్ మిస్టరీ నేపథ్యంలో సాగే వినూత్నమైన కథ ఇదని దర్శకుడు తెలిపారు. తన కెరీర్‌లో ఇదొక ప్రత్యేక చిత్రమని, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకుంటుందని హీరో నవీన్‌చంద్ర తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణ సంస్థ: స్కైలైన్ మూవీస్, సమర్పణ: అనిల్ సుంకర, దర్శకత్వం: మదన్ దక్షిణామూర్తి.

# కన్నప్ప పౌరాణికం కాదు.. మన చరిత్ర



''కన్నప్ప' గురించి ఎంతో రీసెర్చ్ చేశాను. కన్నప్ప కథతో ఇంత వరకు వచ్చిన సినిమాలన్నీ చూశాను. అన్నింటినీ గమనించాను. అప్పుడు నాకర్థమైన విషయం ఏంటంటే.. కన్నప్ప కథ మైథాలజీ కాదు. ఇది మన హిస్టరీ.' అని దర్శకుడు ముఖేష్‌కుమార్ సింగ్ అన్నారు. ఆయన దర్శకత్వంలో మంచు విష్ణు కథానాయకుడిగా రూపొందిన భక్తిరసాత్మక చిత్రం 'కన్నప్ప' ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ముఖేష్‌కుమార్‌సింగ్ విలేకరులతో ముచ్చటించారు. ' సూపర్‌స్టార్లయిన మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్‌లతో పనిచేయడం మరిపోలేని అనుభవం. ఇక విష్ణు కన్నప్ప పాత్రకు వందశాతం న్యాయం చేశారు' అని తెలిపారు ముఖేష్‌కుమార్ సింగ్. రెండో శతాబ్దపు వాతావరణం తెరపైకి తేవడానికి ఆర్ట్ డైరెక్టర్‌తో కలిసి ఎంతో రీసెర్చ్ చేశామని, ఎన్నో మ్యూజియంలను సందర్శించామని, వెపన్స్, కాస్ట్యూమ్స్ మీద పరిశోధనలు జరిపామని, పొల్యూషన్ లేని నాటి వాతావరణాన్ని ప్రతిబింబించేందుకే సినిమాను న్యూజిలాండ్‌లో తీశామని ఆయన అన్నారు. ఇందులో ప్రాధాన్యత లేని పాత్ర ఉండదని, ముఖ్యంగా ప్రభాస్‌పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని, రీసెంట్‌గా శ్రీకాళహస్తి దేవాలయ అర్చకులకు ఈ సినిమాను చూపించామని, వారు మెచ్చుకోవడమే కాక, సెకండ్ పార్ట్ ఎప్పుడు వస్తుంది? అనడిగారని ముఖేష్‌కుమార్ చెప్పారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.